# స్నేహ ముద్ర

ఎంతోకాలం నుంచి వేచి చూచిన ఆహ్వానం రానే వచ్చింది. విజయ సారథి కుమార్తెకు పెళ్ళి. వేదిక జయనగర్‌లో శ్రీ రాజరాజేశ్వరి కళ్యాణ మండపం.కలాశ పాళెం బస్‌స్టాండులో బస్సు దిగి, 8 బి వీగాసీ, 8 ఇని గానీ పట్టుకుంటే కళ్యాణ మండపం ఎదుటనే దిగొచ్చునట. ఆహ్వాన పత్రిక క్రింది భాగంలో సూచన కాన వచ్చింది. వెళ్లేరోజు, తిరిగి వచ్చేరోజు, మధ్యలో పెళ్ళిరోజు. వెరశి బడికి మూడు రోజులు సెలవు పెట్టాల్సి వుంటుంది. ఫరవాలేదు. విజయసారథి పనిపైన అవసర మైతే నెల రోజులైనా సెలవు పెట్టొచ్చు. అది కాస్తా లీవ్ ఆన్ లాస్ ఆఫ్ పే అయినా తటపటాయించను. పైగా ఇంకొకటి ఆ పెళ్ళికి ఉత్తరప్రదేశ్ నుంచీ రవి శంకర్ సిన్హా తప్పకుండా వస్తాడు.

రవిశంకర్ సిన్హా...ఎంత మంచి పేరో! నాకు వుంది ఒక పేరు. ఎందుకూ సుబ్బారావు అని! అస లొకప్పుడు సుబ్బారాయుడు అన్నదే మదీయ నామధేయం. చచ్చి సేయం గల విన్నపాలతో దాన్నెట్లాగో సుబ్బారావని మార్పించుకున్నాను. అయినా స్నేహితుల పేర్ల ముందు నా పేరు వెలవెల పోతూనే వుందని నాకు తెలుసు. ఏం చేయాలి? అంతా మన కర్మ.

రవిశంకర్ సిన్హా అంటే అప్పటికతడేదో పరాయి రాష్ట్రానికి, పరాయి భాషకు చెందినవాడని అనుకున్నారంటే మీరు పప్పులో కాలు వేసినట్టే. బర్మాలో పదిహేనేళ్ళకు పైగా నివసించి, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో స్వదేశానికి తిరిగి వచ్చిన ముల్లంగి యతిరాజులు నాయుడుగారు రంగూనులో వుండగా పుట్టిన తన కుమారుడికి రవిశంకర్ సిన్హా అని పేరు పెట్టుకున్నాడు. "ఏమిటండీ నాయుడు గారూ! ఇదేమిటో తెలుగు పేరులా లేదే" అని ఎవరైనా సందేహం వెలి బుచ్చితే ఆయన పకపకా నవ్వి "మా రెండోవాడి పేరేందో తెలుసునా?" అని ఎదురు ప్రశ్న వేసేవాడు. ఆ రెండో అబ్బాయి పేరు బిపిన్‌చంద్ర అగర్వాల్. అబ్బాయిల తర్వాత నాయుడుగారికి ఇద్దరు అమ్మాయిలు గూడా వుండిపోయారు. పెద్దమ్మాయి దీప్తి. రెండోది తనూజ! నాయుడుగారు భలే గమ్మత్తయిన మనిషి.

అయితే పేర్లు పెట్టడంలో మగ, ఆడ పిల్లలకు మధ్య పక్షపాతం పాటించే కుసంస్కారి మాత్రం కాదు. ఎప్పుడైనా ఆ ప్రసక్తి వస్తే "ఇంకా నయం! దీప్తి త్రివేది అనీ, తనూజా ముఖర్జీ అని పెట్టనందుకు సంతోషించండి." అనే వాడా యన.

హైస్కూల్లో చేరడం కోసం నేను చిత్తూరు వెళ్ళి మా దూరపు బంధువుల ఇంట్లో పేయింటింగ్ గెస్టుగా కుదురుకునే నాటికి యతిరాజులు నాయుడుగారు సుబేదారు వీధిలో ఓ పాతకాలపు పాత కట్టడాన్ని కొనుక్కొని, రంగూను వాస్తు నగిషీలతో దాని రూపు మార్చి అందులో దర్జాగా జీవిస్తున్నాడు.

నేనేమో పల్లెటూరివాడినైపోయాను. అమాంతంగా టౌనులోకి వెళ్ళి పడినందు వల్ల నా పని చిన్న తోటలోనుంచి పెద్ద అడవిలోకి విసిరిపారవేసినట్టయింది. చురుగ్గా, నాజుగ్గా, ధీమాగా నాకు తెలియని విషయాలను గురించి మాట్లాడుకుంటూ నాకు తెలియని ఆటలు ఆడుకుంటూ ఆకాశానికి మూడే బారలన్నంత వుత్సాహంగా వుండే పట్నవాసపు కుర్రవాళ్ళ మధ్య నేను బేలముఖం పెట్టుకుని, బిక్కరించే వాడిననుకుంటాను. ప్రక్క ప్రక్కనే కూచున్నప్పటికీ డెస్కు మేట్లకు—నాకు మధ్య ఎంతో దూరమున్నట్టు తోచేది. వాళ్ళతో కలిసిపోయే చొరవ నాకు లేదు. నన్ను తమతో చేర్చుకోవాలన్న ధ్యాస వాళ్ళకు లేదు దిగులు దిగులుగా రోజులు వెళ్ళబుచ్చేవాణ్ని. ఎందుకొచ్చిన చదువురా బాబూ, పల్లెకు పారిపోదామనిపించేది. నాన్న కొడతాడని భయం ఒడ్డున పడిన చేపలా నేనిలా గిలగిలలాడిపోతుండగా ఒక విచిత్రం జరిగింది. దసరా సెలవుల తరువాత తిరిగి వెళ్ళేసరికి క్వార్టర్లీ పరీక్షల పేపర్లు మా చేతి కొచ్చేశాయి. ఒకరిద్దరు టీచర్లు పేపర్ల కట్ట చేతిలో వుంచుకొని గదిలోకి ప్రవేశిస్తూ "ఈ క్లాసులో సుబ్బారావంటే ఎవరు?" అని ఆరా తీశారు. మరి కొందరు పేపర్లు ఇస్తూ ఇస్తూ నా పేపరు దగ్గరికి వచ్చేసరికి "సుబ్బారావంటే నువ్వేనా? ఏ ఊరు బాబూ నీది? మీ నాన్నగారేం చేస్తుంటారు?" అని పరామర్శిం చారు. అంతటితో మన దశ తిరిగిపోయింది. క్లాసుకు ఫస్టొచ్చిన కుర్రాడు తమ ప్రక్కనే కూర్చోవడం నా డెస్కు మేట్లకు గొప్ప గర్వకారణమైపోయింది ఇతరుల జట్టులో చేరకుండా వాళ్ళతో చేరితే చెడిపోతావని హెచ్చరిస్తూ వాళ్ళు హమేషా నన్ను కనిపెట్టుకుని వుండసాగారు పుర ప్రముఖుల బిడ్డలతో సహవాసం గదా! నా మట్టుకు నేను కూడా వాళ్ళ స్నేహాన్ని అపురూపంగానే భావిస్తూ, వాళ్ళ కిష్టమై నట్టుగానే నా ప్రవర్తనని మలుచుకోసాగాను.

అన్నట్టు విజయసారథిని పరిచయం చెయ్యలేదు గదూ! సారథి అడ్వకేటు రంగ రామానుజంగారి కుమారుడు. సుందరయ్యరు వీధిలో వాళ్ళ స్వంత యిల్లు. నేను సుందరయ్యరు వీధిని, సుబేదారు వీధిని కూడా దాటుకుని మరి కొంతదూరంలో వున్న గూళింగ్స్ పేటకు వెళ్ళవలసి వుండేది. ఇందాకా మా దూరపు బంధువులన్నానే ఆ ఇంటి యజమాని మునిసిపాలిటీలో బిల్ కలెక్టరుగా పనిచేస్తూ చిన్న పెంకుటింట్లో అద్దె కుండేవాడు. ఉదయవేళల్లో నేనింత చద్దన్నం తిని, చక్కా సుబేదారు వీధి కొచ్చేసేవాణ్ని. గొలుసు నుంచి కుక్కను వదిలిపెట్టలేదన్న నమ్మకము కుదిరిన తరువాత మెల్లగా గేటు తీసుకుని వరండాలోకి వెళ్ళేవాణ్ణి. అక్కడ నేను తచ్చాడుతున్న విషయం పనిమనుషులెవరైనా తెలియజేస్తే చొక్కాకు గుండీలు వేసుకోకుండా, బూట్లకు నాడాలు బిగించకుండా పుస్తకాల సంచిని నేల పైన్నే ఈడ్చుకుంటూ సిన్హా తొందర తొందరగా తయారై వచ్చేసేవాడు. ఇద్దరమూ కలసి సుందరయ్యరు వీధికి వెళ్ళేవాళ్లం. కచేరీ గది ప్రక్కన మా పొలకువను పసికట్టగానే రంగరామానుజంగారు "అదేయ్ సారథీ! ఉంగో ఫ్రెండ్స్ వందాచ్చు" అని లోపలికి కేక పెట్టేవాడు. ముగ్గురమూ అదొక రివాజుగా చేతులు కూర్చుకుని బడి కంపౌండులో అడుగు పెట్టేసరికి సైకిల్లో వచ్చి దిగే ఇంగ్లిషు మాస్టారుగారు మమ్మల్ని "త్రి మస్కిటీర్స్"గా సంభావించేవారు.'త్రి మస్కిటర్స్' అంటే ఎవరికి తెలుస్తుంది? త్రిమూర్తులంటే అందరికీ తెలిసిన విషయం. రాను రాను పరిచయ వర్గాల్లో మాకు త్రిమూర్తులన్న పేరు రూఢి పడిపోయింది.

ఇక చెప్పేదేముంది! హైస్కూల్లో చదువుకున్న ఆరేళ్ళూ మా పాలిటికి ఆరు నిమిషాల్లా గడిచిపోయాయి. ఎప్పుడెప్పుడు ఆఖరు గంట మోగుతుందా అని వేచి వుండేవాళ్ళం. బడి నుంచి బయట పడగానే పుస్తకాలన్నీ విజయసారథి ఇంట్లో పారేసి, ఇచ్ఛ వచ్చిన వైపుకు షికార్లు లంకించుకునే వాళ్ళం. చిత్తూరు పట్టణంలోనూ, దాని పరిసరాల్లోనూ దర్శనీయ ప్రదేశాలేవీ లేదన్నది జనం అనుకునే మాట. కానీ, చూడదగిన ప్రదేశాలని కొన్నింటికి ముద్ర వేసేశాము. ఏటి కవతల అరగొండకు వెళ్ళే రోడ్డుపైన ధర్మరాజుల వారి గుడి, కట్టనుంచి కావైపున తిరుపతికి వెళ్లే రోడ్డుపైన సప్త కన్నికల గుళ్ళు, ఊరి మధ్యలో కుమారస్వామి గుట్ట. పలమనేరు వెళ్లే రహదారిపైన ఇరువారం బ్రిడ్జి. అన్నిటికన్నా ముఖ్యమైనవి గిరింపేట చెరువుకు-రైలుదారికి మధ్యగల రిజర్వు ఫారెస్టులో ముగ్గులో వేసిన గీతల్లా

అల్లిబిల్లిగా వ్యాపించిన రౌండ్ రోడ్స్ ధాతు కరువురోజుల్లో జిల్లా కలెక్టరుగా వుండిన ఒక ఇంగ్లీషు దొర పేద ప్రజల జీవనోపాధికోసం వాటిని వేయించాడట. శని, ఆదివారాల్లో మేము కొంచెం ముందుగా వెళ్ళి ఆ రౌండ్ రోడ్స్ అన్ని సర్వే చేసేవాళ్ళం. ఒకచోట రోడ్డు నుంచి కొంత దూరంలో గుబురైన చెట్ల మధ్య "ఈజీ చెయిర్" అంటూ ఒకటుండేది. మరేం లేదు. అర్ధ చంద్రాకారంగా వెనక్కి వాలి అనుకోవడానికి వీలుగా వున్న ఓ గుండుకు ఆనికగా బెంచీలలాగా రెండు బండలు వేయించారు. ఎన్నెన్ని సెలవురోజులు, ఎన్నెన్ని సుదీర్ఘ సాయంకాలాలు మే మక్కడ కథలూ, కబుర్లూ చెప్పుకుంటూ కాలక్షేపం చేశామో లెక్కలేదు. కుటుంబ సభ్యులందరినీ ఎదుట కూచోబెట్టుకుని రంగరామానుజంగారు చెప్పిన షెర్లాక్ హోమ్స్ పరిశోధనలు, గలివర్, సింద్‌బాద్, క్రూసో సాహసయాత్రలు, షేక్స్పియరు నాటక కథలు మొదలైన వాటిని విజయసారథి మాకు వల్లించేవాడు. నేను నా పల్లెటూరి సంస్కృతి నుంచి పుక్కిట బట్టుకున్న కాశీమజిలీ కథలు, భట్టి విక్రమార్కుల కథలు రేచుక్క-పగటి చుక్కల కథలు చెప్పగలిగేవాణ్ని. "కథలు చెప్పడం నాచేతగాదురా బాబూ! కావలిస్తే ఏమైనా పుస్తకాలు తెచ్చిస్తాను" అనేవాడు సిన్హా. కొండదాసరి, వారేవా చర్చి గంట, పంతులమ్మ లాంటి కొవ్వలి నవలలు, సీవేనా శాబూరాయి, వాడే వీడు, చోర శిఖామణి లాంటి అపరాధ పరిశోధక నవలలు యతి రాజులు నాయుడుగారి పుస్తక సంచయం నుంచి సిన్హా ద్వారా నేను సంపాదించిచదివినవే!

ప్రయాణికు లెంతకాలం కలిసి పయనించినా ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట విడిపోక తప్పదు. హైస్కూలు చదువుల చివర మా విషయంలోనూ అదే జరిగింది. యతిరాజులు నాయుడుగారు సిన్హాను మదరాసుకు పంపి బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివించారు. రంగనామాంజంగారికి మట్టుకు తన కొడుకు ఇండియాకు ప్రైమ్ మినిష్టర్ కావడం కన్నా తనలాగ లీడింగ్ లాయరు గావడమే ఉత్తమోత్తమంగా తోచింది. విజయసారథి అర్హతలైతే సంపాదించాడు గానీ, తండ్రిలా ప్లీడర్ వృత్తిలో రాణించలేకపోయాడు. పది పన్నెండేళ్ళ పర్యంతం తండ్రిచాటు బిడ్డగానే [జూనియర్ లాయరుగా తన్నమాట!] మల్ల గుల్లాలు పడి, ఆయన శాస్త్రా కళ్ళు మూసిన తరువాత బెంగుళూరు వెళ్ళిపోయి, అక్కడ తనకు పిల్ల నిచ్చిన మామగారి ప్రాపకంలో ఏదో వ్యాపారం మొదలెట్టాడు. ఆ ప్రయత్నం కూడా కలిసి రాలేదు. ఆ తరువాత కొందరు భాగస్వాముల్ని కలుపుకుని ఒక

పాలిటెక్నిక్ కళాశాల నడుపుకోడానికి కర్ణాటక ప్రభుత్వం నుంచి అనుమతి పుట్టించుకున్నాడు. ఆ విద్యా సంస్థ సారథికొక కల్పవృక్షంలా వుపకరించింది. అయిదేళ్ళు తిరగకముందే జయనగర్‌లో ఇల్లు కట్టించుకున్నాడు. కారు కొన్నాడు. రోటరీ క్లబ్బులో మెంబరుగా చేరాడు చాలని దానికి కొన్నేళ్ళ క్రితం కార్పొరేషన్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా కూడా పోటీ చేశాడు. డిపాజిట్టు దక్కినట్టు లేదు. వుండ బట్టలేకనే నొక ఓదార్పు వుత్తరం రాస్తే 'గెలవడం గానీ, ఓడడం గానీ ముఖ్యం కాదు. ఎన్నికల్లో నిలబడడమే ముఖ్యం. ఇందువల్ల నేను పేరెన్నికగన్న సిటీ జనంలో ఒక్కడిగా లెక్క కొచ్చేశాను' అని రాశాడు.

రవిశంకర్ సిన్హా విషయంలో ఇలాంటి ఒడిదుడుకు లేవీ ఏర్పడినట్టు లేదు. సూటిగా దూసుకెళ్ళి లక్ష్యాన్ని అందుకున్న రాకెట్టులా అతడి వుద్యోగ యాత్ర సఫలమైపోయింది. పెద్ద ఫర్మ్‌లో చిన్న వుద్యోగిగా చేరి ఇరవై ఏళ్ళు గడిచేలోగా దానికి మేనేజరై పోయాడు. నాలుగు చక్రాల వాహనాల విడి భాగాలు తయారు చేసే ఆ ఫాక్టరీ ఢిల్లీకి డెబ్బై అయిదు కిలోమీటర్ల దూరంలో వుందట. అయితే, దానికి సంబంధించిన సర్వ వ్యవహారాలకు ఢిల్లీయే కార్యస్థానం. అందువల్ల నెలలో ఇరవై రోజులైనా సిన్హా దేశ రాజధానిలోనే వుంటాడట. ఆ విధంగా జాతీయ స్థాయిలో మంత్రులు, మాజీ మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, బడా బడా వణిక్ప్రముఖులు, ఇంకా అలాంటి వాళ్ళతోనే అతడికి దోస్తీ. 'ఇద్దరు సెక్రెటరీలు, మూడు కార్లు, నాలుగు ఫోన్లు– ఎలాగైనా మనవాడు అడిగి వచ్చినవాడు లేరా సుబ్బారావ్!' అంటాడు విజయసారథి, సిన్హాను గురించిన వివరాలన్నీ నాకు సారథి మూలంగానే తెలిసివచ్చాయి.

మిత్రులతో పోల్చుకోవడానికి వీల్లేదు గానీ, నా ఉద్యోగ జీవితంలో నేనూ ఎంతో కొంత ప్రగతిని సాధించినట్టే చెప్పుకోవచ్చు. సెకండరీ గ్రేడు టీచరుగా ఓ పల్లెటూరి బడికి పరిమితమైపోకుండా, ప్రయివేటుగా బి.ఏ.కు కట్టి, ఆపైన బి ఇడి. కూడా పూర్తి చేశాను. జిల్లా పరిషత్తు వాళ్ళు హైస్కూలు టీచరుగా ప్రమోషనిచ్చి నాలుగూళ్ళు తిప్పించి, ఇటీవల జిల్లా హెడ్ క్వార్టర్స్‌కే బదిలీ చేశారు. చదువు కున్న స్కూల్లోనే టీచరు గావడం నాకు అందల మెక్కినంత ఆనందం.

గడిచిన ముప్పై ఏళ్ళలో నేను విజయసారథినైతే నాలుగైదుసార్లు కలుసు కున్నాను. సిన్హాను కలుసుకోవడం మాత్రం కుదరలేదు. వాడు తప్పకుండా సారథి కుమార్తె పెళ్ళికి వస్తాడని నా ఊహ. అబ్బ, మళ్ళీ ఎంత కాలానికి మేం ముగ్గు

రమా కలుసుకోడం! వివాహానికి ఆహ్వానం అందినప్పటి నుంచి నా మనసులో ఆనందం పరవళ్ళు తొక్కుతోందంటే అందులో ఆశ్చర్య మేముంది!

• • • •

బెంగుళూరు కూడా దేశంలోని మిగిలిన నగరాల లాంటిదే గావచ్చు. మురికి వాడలు, చీకటి గొందులు, ఈలిబాధలు, పేవ్‌మెంట్ల బ్రతుకులు అక్కడ కూడా వుండొచ్చు. కానీ, నగరం నడిబొడ్డున దిగి బస్సులలోను, ఆటోలలోను తిరిగి చూచిన వాళ్ళకది 'ఆకులు రాలని, పూలు వాడని వసంతారామం'లా కనిపిస్తుంది. నేను జయనగర్ చేరుకునేసరికి మలిసంజవేళ కావచ్చింది. విద్యుద్దీపాల కాంతులు చెట్ల నీడలతో దోబూచు లాడుతున్నాయి. హఠాత్తుగా వెళ్ళి ఆ వేళప్పుడు రాజేశ్వరీ కళ్యాణ మండపం ఎదుట నిల్చోడం ఒక మరపురాని అనుభవం. నిర్మాణ వైచిత్రిని బట్టి మాయామందిరాలను, అలంకరణను బట్టి గంధర్వుల విమానాలను, విస్తీర్ణాన్ని బట్టి పెద్ద సర్కస్ డేరాలను తలపిస్తున్న ఆ కళ్యాణ మందిరం పెళ్ళి జరిపిస్తున్న కన్యాదాత ప్రాభవాన్ని ఎలుగెత్తి చాటుతోంది. నేను వెళ్ళేటప్పటికి పెళ్ళి వేడుక అప్పుడప్పుడే ఊపందుకుంటూ ఉంది. వివిధ వేష భూషణాలతో, విలాస విభ్రమాలతో పైలోకాల నుంచీ దిగి వచ్చిన వారిలా అతిథి జనం నవ్వుల రతనాలు రువ్వుకుంటూ, మాటల మాణిక్యాలు వినిమయం చేసుకుంటున్నారు. లోపల వివాహ వేదికపైన ప్రస్తుతం నృత్య ప్రదర్శన జరుగుతోంది. సాత్విక కళల మూలంగా రసాస్వాదన చేయగల ఓపిక ఉన్నవాళ్ళు కొందరు హాల్లో కూర్చున్నారు. మరోవైపున రకరకాల వాహనాలపైన ఒక్కొక్కరుగా, జంటలు జంటలుగా, జట్లు జట్లుగా ఆహ్వానితులు వచ్చి దిగబడి పోతున్నారు. ఆ జన సంరంభంలో ఒక చోట మెరుపు మెరిసినట్టుగా విజయ సారథి కానవచ్చేసరికి నాకు ప్రాణం లేచి వచ్చినట్టయింది. సంస్కార భంగమేమో నని కూడా తలచక 'హలో విజయసారథీ!' అని కేక పెట్టాను. సారథి తిరిగి చూచాడు.

"ఏంటోయ్ సుబ్బారావ్! ఎప్పుడొచ్చావ్? టిఫిన్ తీసుకున్నావా ? హాల్లోకి వెళ్ళి కూచోరాదూ? యామినీ కృష్ణమూర్తి కిమ్మరాలులే! పట్టుబట్టి హైదరాబాదు నుంచి రప్పించాను. విదేశీ పర్యటన వాయిదా వేసుకుని మరీ వచ్చింది ... ఎవ్రీ దేవరాయరే! అభివాద, అభివాద..."

నన్ను పలకరించటం, నర్తకిని పరిచయం చెయ్యడం, కారులో దిగిన

ఇద్దరు టోపీ వ్యక్తికి స్వాగతం పలకడం – ఒక చిన్న ప్రసంగంలో ఇన్ని అంశాలు ఇమిడి ఉన్నాయని నేను గ్రహించడానికి కొంతసేపు పట్టింది. ఈలోగా అతిథి సత్తముణ్ణి ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాక, గౌరవ పురస్సరంగా చేయి పట్టుకుని లోపలికి తీసుకెళిపోతున్నాడు విజయసారథి.

భారీ ఎత్తున శుభకార్యం నిర్వహిస్తున్న పెళ్ళి పెద్ద ఆ మాత్రం 'బిజీ'గా ఉండవలసిందే ఎవరికి చెల్లించవలసిన మర్యాద వారికి చెల్లించక తప్పదు నేను నా కుతూహలం కొద్దీ విజయసారథిని తొందరపెట్టడం న్యాయం కాదు. ఎలాగైనా 'కాలక్షేపం జరగాలి కదా! ఓ అరగంటసేపు నృత్య ప్రదర్శనాన్ని చూస్తూ హాల్లో కూర్చున్నాను. ఆ తరువాత మేడపైకి వెళ్ళి రాత్రి తొలి జాము వేళప్పటి బెంగుళూరు దృశ్యాలను అనేక కోణాల్లో నుంచీ తిలకించాను. ఓ మూలగా కూచుని తీసుకెళ్ళిన పుస్తకం చదువుకోడానికి కూడా ప్రయత్నించాను. కానీ, మనసు మాత్రం దేనిపైన గానీ లగ్నం కావడం లేదు. వీలు చేసుకుని విజయసారథిని ఓ విషయం అడిగి ఉండవలసింది. ఆ మాట అనుకుంటూ ఉండగానే అతడికి మరేదో పని తగిలింది. ఈసారి కనిపించగానే అడగాలి...

ఎనిమిదింటికి తరువాత విందు ప్రారంభమైంది. అతిథి జనాన్ని వడ్డించిన విస్తర్లపైకి ఉరికిస్తూ, భోజనాగారం గేటు దగ్గర సారథి కనిపించాడు. ఎలాగైనా అది మాట్లాడడానికి వీల్లేని పరిస్థితి అతిథి జనం ఒక కెరటంలా వచ్చి నెట్టడం వల్ల లోపలికి కొట్టుకపోయాను భోజన పరాక్రమంలో పోటీలు పెట్టినట్టుగా డయినింగ్ హాల్లో అప్పటికే వీరావేశం చెలరేగుతూ వుంది. 'సాంబార్...పొరియల్..అవియల్ అప్పళం...'లాంటి మాటలు,గంగాళాల డబడబలు,గ్లాసుల గలగలలు,వడ్డించే వాళ్ళ పరుగులు– ఈ సంభరంలో బల్లల మధ్యనుంచీ వడివడిగా నడిచిపోతున్న విజయసారథిని ఇట్టే గమనించేశాను. "సారథీ! మాట, మాట!" అప్రయత్నంగా నానోటినుంచీ పిలుపు వెలువడింది.అనుకోని పిలుపు సారథికి అట్టే ఇంపితమైనట్టు లేదు. అయిష్టంగానే వెనుదిరిగాడు. పిలిచింది నేనని తెలియగానే చిరాకును కాస్త తుడిచిపెట్టుకునే ప్రయత్నంలో పడి– "ఏమిటి, పిలిచావా?" అంటూ దగ్గరికొచ్చాడు. "ఏంలేదు. సిన్హాను గురించి తెలుసుకుందామని వచ్చాడా? వస్తాడా? చూచి చాలా కాలమైంది కదా. అందుకని ..." అప్పటికి నేనేదో సంజాయిషీ చెప్పుకున్నట్లుగా నా చెవులకే ధ్వనించింది. సారథి కూడా ఎంతో ఉదారంగా ఒక నేరస్థుణ్ణి క్షమించేసినట్టు వీలయినంత ప్రసన్నంగానే బదులు చెప్పాడు. "రాకపోతే ఊరుకుంటానా! వచ్చాడు సాయంకాలం ఫ్లైట్‌లో వచ్చాడట. ఏదో హోటల్లో దిగాడు. ఇందాక ఫోన్ చేశాడట కూడా. ఇప్పుడో, ఇంకాస్సేపటికో రావచ్చు. ఐయామ్ ఎక్స్‌పెక్టింగ్ హిమ్!"

దేనికోసమో నిరీక్షిస్తున్నట్టుగా నేను కూడా మేలుకుని కూర్చున్నాను. సిటీలో రెండో సినిమా కూడా వదిలిపెట్టి వుండొచ్చు. అప్పుడిక నిగ్రహించుకో లేక అదమరిచి నిద్రపోయాను. మెలకువ వచ్చేసరికి మంగళ వాద్యాలు మ్రోగు తున్నాయి. గంట నాలుగున్నర అయిదూ ఇరవై అయిదుకే ముహూర్తం కాల కృత్యాలు తీర్చుకుని అదరాబాదరాగా హాల్లో అడుగు పెట్టాను. ముందువైపు కుర్చీలు నిండిపోయాయి. పది వరసలకు వెనుక ఓ కుర్చీ ఖాళీగా వుంటే వెళ్ళి అందులో కూర్చున్నాను.

వధూవరులు పీటలపైన వున్నారు. సన్నిహిత బంధువర్గం వాళ్ళ చుట్టూ మూగిపోయింది. పురోహితుడి మంత్రాలు మైకులో నుంచి వినిపిస్తున్నాయి. ఆ సందడిలో జాలర్లుగా వదిలి పెట్టిన పూలదండలకు వెనుక ఎవరితోనో మాట్లాడుతూ కనిపించాడు సారథి. ఎక్కడో చూచిన ముఖంలాగే వుంది. ఎక్కడ ? ఎప్పుడు ? అంగ విన్యాసాల్ని హావభావాల్ని అయిదు నిమిషాల దాకా గమనించిన తరువాత నా బుర్రలో ఒక మెరుపు మెరిసింది. 'చంపేశావురా మిత్రమా! ఎంతగా మారి పోయావురా నాయనా!' అనుకున్నాను. సన్నగా, పొందిగ్గా, బాల ప్రహ్లాదుడి వేషానికి సరిపోయేటట్టుండేవాడు నాకు తెలిసిన సిన్హా– ఇప్పుడందుకు విరుద్ధంగా వున్నాడు. ముఖం పెద్ద సైజు టొమాటో పండులా వుబ్బిపోయింది. కళ్ళు చిన్నవై పోయాయి. బట్టతల వచ్చేసింది. బుట్ట బొమ్మకు పాంటు, చొక్కా తొడిగినట్టున్న వాలకం 'యద్భావంతద్భవతి' అంటారు గదా! సిన్హా ఆకారం ఉత్తరాది పేరుకు అనుగుణ్యంగా మారిపోయినట్టుంది.

ఈలోగా, చాలా ముఖ్యమైన పని ఒకటి తగిలినట్టు విజయసారథి సిన్హాను వెంటబెట్టుకుని ప్రేక్షకుల్లో కూర్చున్న బంధు మిత్రులవైపు వచ్చేశాడు. వాళ్ళను చూడగానే కొందరు లేవడానికి ప్రయత్నించారు. కొందరు లేచి విల్చున్నారు. "మీట్ మై ఫ్రెండ్ మిస్టర్ సో అండ్ సో, జనరల్ మేనేజర్ డాష్ డాష్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్" ఓహో అట్లాగా! నమస్కారం ప్రతి నమస్కారం. "వీరెవరో తెలుసా సిన్హా?" ఆ ప్రముఖుల్ని గురించిన వివరాలు "గ్లాడ్ టు మీట్ యూ–సమా దరణలు ఇలా పరిచయ కార్యక్రమం సాగిపోతోంది. విజయసారథి సిన్హాను నా దగ్గరకు లాక్కొచ్చి వీణ్ని చూశావటోయ్ సిన్హా! మన సుబ్బారావు. చిత్తూర్లో మన చిన్ననాటి జీవితం. హైస్కూలు చదువు, రౌండ్ రోడ్సు, ఈజీ చెయిర్, అదంతా మరిచిపోగలమా! వీడి పెళ్ళికొచ్చింది. సగం నిన్ను చూడ్డానికే" అంటున్నా డనీ, సిన్హా ఆనందంతో విప్పారిపోయిన ముఖంతో "ఆహా! ఎన్నాళ్ళకెన్నాళ్ళ కోయ్ సుబ్బారావ్! ఎన్నిసార్లు తలుచుకుంటానో నిన్ను గురించి! కళ్ళలో మెదిలే

వాడివి" అంటూ పరవశించి పోతున్నాడని నేననుకున్నాను. లేదా అలాంటి సంఘటన ఏ క్షణాన్నయినా జరగబోతున్నదని ఆశించాను. అయితే ఆ మధుర సన్నివేశం ఊహగానే మిగిలిపోయింది. ఆ పగటి కలను బెదరగొడుతూ ముహూర్త మేళం నా తల దిమ్మ తిరిగేట్టుగా మ్రోగసాగింది. సూత్రధారణ ముగిసింది. వధూవరులపైన అక్షింతల వర్షం కురిసింది. జనం ఒక పెట్టున పైకి లేచారు. ఆ వ్యవధిలో నా మిత్రులు వెళ్ళిన జాడ తెలియకుండా ఎటో జారిపోయారు.

నేను కాలు గాలిన పిల్లిలా కళ్యాణ మందిరమంతా కలయ తిరిగాను. మేడపైకి వెళ్ళి మూల మూలా, గది గదీ వెదికాను. కొందర్ని అడిగి చూశాను. కార్లు, ఆటోలు కదిలిపోతున్న సవ్వడి వినిపించింది. బాల్కనీ కప్పువైపు పరుగెత్తాను. ఎట్లాగైతేనేం, నా అన్వేషణ ఫలించింది. డ్రయివరు డోరు తెరచి పట్టుకున్నాడు. సిన్హా కారులో కాలు మోపడానికి సిద్ధంగా వున్నాడు. సారథి వీడ్కోలిస్తున్నాడు.

నా గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. ఒక్క ఊపులో మెట్లన్నీ దిగి, మనుషుల్లో దారి చేసుకుంటూ బయటికి వచ్చి కారువైపు పరుగు తీశాను. తీరా కారు దగ్గరికి వెళ్ళేసరికి ఉచ్ఛ్వాస నిశ్వాసాల వురవడిలో మాట పెకలడం లేదు. విండోలో తల దూర్చి సిన్హా వైపు చేయి సాచాను.

"అరరే, పొరబాటయి పోయిందోయ్ సిన్హా! తెలియదూ, సుబ్బారావు! చిత్తూరు నుంచీ వచ్చాడు.చెబుదా మనుకుంటూనే మరచిపోయాను."-నొచ్చుకుంటూ అన్నాడు సారథి."అట్లాగా! బాగున్నావా సుబ్బారావ్! నిన్ను కూడా చూచేశాను. చాలా సంతోషంగా వుంది. నీతో కొంతసేపు గడపాలని కూడా వుందనుకో! ఏం చెయ్యను చెప్పు. ఉదయం ఫ్లైట్‌లో మెడ్రాస్ వెళ్ళాలి. ఎప్పుడైనా ఢిల్లీ వస్తే..."

సిన్హా వాక్యం పూర్తి కాలేదు. ఢిల్లీదాకా వెళ్ళే పని నాకీ జీవితంలో తటస్థించదని ఆ కారు కూడా గ్రహించేసిందేమో. సిన్హా వాక్యం పూర్తిగాకముందే చిర చిరలాడుకుంటూ స్టార్టయిపోయింది.

గాలి తీసేసిన బెలూనులా నేను నీరసించిపోయాను. క్రిందటి రోజు సాయంకాలం పుష్పకవిమానంలా కనిపించిన ఆ కల్యాణ మందిరం పెనుభూతంలా కనిపించసాగింది. దాని బారినుంచి తప్పించుకోవడం కోసం ఈవలికి వస్తే బోసిపోయి వున్న రోడ్లు నీళ్ళింకిన నదుల్లా కనిపించాయి. కాంక్రీటు కట్టడాలు అంత హూను శైలలను తలపించాయి. అంతెందుకు? వసంతరామంలా తోచిన బెంగుళూరు

పట్టణం ఎడారిగా మారిపోయినట్టు తోచిందంటే ఏమనుకోవాలి? బహుశా ఈ మార్పుకు కారణం బాహ్య ప్రపంచంలో గాక నాలోనే వుండాలి. ఏమిటది? వున్న ఇంటిలో ఒక భాగం కూలిపోయినట్టుగా, నీడ నిచ్చిన చెట్టుకో ఓ కొమ్మ విరిగి క్రింద పడిపోయినట్టుగా, నిల్చున్న నేల తీవ్రంగా కంపించినట్టుగా దిగులూ, దైన్య భావమూ నన్ను వెంటాడసాగాయి. చేయడానికి నిర్దిష్టమైన పనేదీ లేకపోయినప్పుడు మానవుడు కొంచెం అర్థరహితంగా ప్రవర్తించక తప్పదేమో! నేను కనిపించిన ప్రతి వాల్ పోస్టర్నీ ఆద్యంతమూ చదివేశాను. ఇళ్ళ ముంగిటి తోటల్లో పొదల్ని ఏ యే ఆకారం క్రింద కత్తిరించవచ్చునో తెలుసుకున్నాను. బార్బర్ షాపుల దగ్గర నిల్చుని కన్నడ పత్రికల ముఖచిత్రాలు కూడా అందంగా వుంటాయని గమనించాను. నగరవాసుల వుదయకాలపు వ్యాపకాలెలా వుంటాయో కొంతవరకు గ్రహించాను. కాలు దారితీసినట్టల్లా అలా ఎంత దూరం తిరిగానో తెలియదు. మధ్యాహ్నం పన్నెండింటికి కర్ణాటక రోడ్డు ట్రాన్స్‌పోర్టు వారి ఫాస్ట్ సర్వీసు బస్సొకటి తిరుపతికి బయలుదేరుతుందని ఎవరో చెప్పిన విషయం జ్ఞప్తికి వచ్చింది. టైమ్ చూచుకున్నాను. పది కావస్తోంది. అప్పటి కింకా నేను టిఫిను చేయలేదని గుర్తుకొచ్చింది. అప్పుడు నేను "బిజ్జలదేవ భవన సముదాయ" అన్న నీలిరంగు కట్టడాల ఎదుట నిలబడి వున్నాను. ఒకవైపున శుద్ధ సాత్వికాహార భోజనశాల. మరొకవైపు హైక్లాసు మిలిటరీ హోటలు. మధ్యలో రకరకాల షాపులు. నట్టనడుమ వెనుకవైపున వున్న సినిమా థియేటరుకు వెళ్ళేదారి. ఎట్టయెదుట పెద్ద పెద్ద గెరిసీడియా చెట్లు. ఆ చల్లటి పట్టులోకి వెళ్ళేసరికి ఒళ్లూ, మనసూ కూడా సొమ్మసిల్లిపోయాయి. టిఫిన్ చేయడమా' కాక మరో అరగంట సేపాగి ఏకంగా భోజనం చేసి బస్ స్టేషనుకు వెళ్ళడమా అన్న మీమాంస ఒకటి ఎదురైంది. ఒకటి రెండు నిమిషాలు తటపటాయించాక రెండో ప్రతిపాదన వైపే మొగ్గి, అక్కడున్న ఒక సిమెంటు బెంచీపైన కూలబడిపోయాను. బరువెక్కిన కనురెప్పలు క్రమక్రమంగా వాలిపోయాయి.

భుజంపైన చల్లటి స్పర్శ ఏదో సోకినట్టే వున్నట్టుండి వులికిపడ్డట్టుగా కళ్ళు తెరిచాను. కాకి ట్రౌజరుపైన అలాంటిదే అరచేతుల చొక్కా తొడుక్కుని చేత లాఠీ లాంటి కర్ర పట్టుకున్న వ్యక్తి ఒకతను నా ఎదుట నిలబడి వున్నాడు.

"ఏమిటి బాబూ! యిక్కడ కూచోగూడదా?" అంటూ లేవబోయాను. లేవకుండా అదిమిపెడుతూ అతడు పకపకా నవ్వసాగాడు.

"భలేవాడివే సుబ్బన్నా! చూడగానే యిదేంధిరా నాయినా ఈయన

యిక్కడికి కొచ్చేసినాడు అనుకుంటి. ఇంతకూ నువ్వేనా కాదా అని కాసేపు కనిపెట్టి చూస్తి. దగ్గిరి కొచ్చి నికరంగా నువ్వేనని తేల్చుకున్నాక భుజంపైన చెయ్యేస్తి. మీ పక్కింటోణ్ణి. తెలియదంలా?"

"ఓరి నీ యిల్లు బంగారంగానూ! నువ్వట్రా సీనూ! ఎంత కాలమైందో నువ్వు ఊరు వదిలిపెట్టి జరుగుబాటు లేక దేశంపాలై పోయావని తెలిసి అయ్యో పాపం అనుకున్నా. ఇంతకూ నువ్వుండదం బెంగుళూర్లోనా? ఏం చేస్తున్నా విక్కడ?"

భవన సముదాయాన్ని చూపిస్తూ అన్నాడు సీను—"ఇక్కడ వాచ్‌మేన్‌ని నేనే! రెయ్యి డూటీ పదహైదు దినాలు. పగులు డూటీ పదహైదు దినాలు. 'అయిదు నూర్లిస్తారు. జీతం. మా యింట్లోది గూడా నాలుగిండ్లలో పని చేసి రెండు నూర్ల దాకా తెస్తుంది. పెద్ద కొడుకును మోటార్ వర్క్‌షాపులో పెట్టినా, రెండోవాణ్ణి ఇంటరులో చేర్పించినా, మూడోవాడు ఏడో తరగతి, ఇక్కడ టిఫిను కోసరమనీ, భోజనం కోసరమనీ టూరిస్టు బస్సులూ, కార్లూ వచ్చి నిలుస్తాయిలే. కనిపెట్టుకు నుంటాను గదా వాళ్లూ ఏదో తోచింది యినా మిస్తారు. చెడి చెన్నపట్నం చేరే వాళ్ళంట ముందు ఇప్పుడు చెడిపోతే బెంగుళూరొస్తా వుండారు. ఎవుడికి దగిన బతుకు వాడికి దొరకతానే వుంది. ఆ మాటకేం గానీ, సుబ్బన్నా! నీ కొడుక్కీ కూతురికి పెండ్లిల్లు చేసేస్తివా?" ఎక్కడందారు.

పేరు పేరునా మా వాళ్ళ యోగక్షేమాలన్నీ అడిగి తెలుసుకున్నాడు సీను. మా అబ్బాయి నా కన్నా పెద్ద టీచరైనాడంటే కాకేమవుతాడు! సదువు పుట్టింటే మీ యింట్లో గదా!" అన్నాడు. అల్లుడూ, కూతురూ కూడా వుద్యోగం చేస్తున్నారంటే "అదే మంచిది. ఇకమీదట వచ్చే కాలాల్లో ఆడ, మగా యిద్దరూ సంపాదించాల్సిందే. అటువంటి యింట్లోనే లచ్మి కల" అన్నాడు.

సీను నాకంటే ఏడెనిమిది యేళ్ళు చిన్నవాడు. నాలాగే చింతపల్లె ఎలిమెంటరీ స్కూల్లో మా నాన్నగారి దగ్గర చదువుకున్నాడు. అయ్యవారంటే ఎంత భయమో అమ్మగారి దగ్గర అంత చనువు వాడికి. మా అమ్మను పెద్దమ్మా అని పిలిచేవాడు. ఆమె కాస్త అనారోగ్యపు మనిషి. అందువల్ల మంచినీళ్ళ బావి దగ్గిరినుంచి రెండు బిందెల నీళ్ళు వాడే తెచ్చి పెట్టేవాడు. మునగచెట్లో కాయలు కోయాలన్నా, బాదం చెట్లో ఆకులుకోయాలన్న పెరట్లో చెట్లకుపాదులుకట్టాలన్నా ఇలాంటి పనులన్నింటికీ

ఉపకరించేవాడు. మా అమ్మ ఎట్లాగైతే పెద్దమ్మ అయిపోయిందో, అట్లాగే నేను వాడికి సుబ్బన్ననైపోయాను. నన్నలా పిలిచేవాడు వాడొక్కడే. పది పదిహేనేళ్ళ తరువాత మళ్ళీ 'సుబ్బన్నా' అన్న పిలుపు వినవచ్చేసరికి నాకు చేజారిపోయిన పెన్నిధి ఏదో మళ్ళీ దొరికినట్టయింది.

దాదా పౌరగంటసేపు చిన్ననాటి కబుర్లన్నీ చెప్పుకున్నాక "పన్నెండు గంటల బస్సులో వెళ్ళాలనుకుంటున్నానురా సీనూ! భోజనం చేసొస్తాను. నేనిక్కడ కూచోడం అందుకే" అన్నాను. "మంచి పని జేస్తివిలే సుబ్బన్నా! ఓటల్ అరలిలో వస్తు క్లాసయిన భోజనం కానా కానా దూరం నుంచి వస్తా" వుంటారు జనం. నువ్వెల్లి భోం చేసిరా" అంటూ నా చేతిలో నుంచి బ్రీఫ్‌కేస్ అందుకున్నాడు సీను.

ఆకలిగొని వున్నానేమో పదిహేను నిముషాల్లో భోజనం ముగించి, చేయి కడుక్కున్నాను. కౌంటరు దగ్గరకొచ్చి బిల్లుకోసం చూచేసరికి "వెళ్ళి రండప్పా! మీ బిల్లు చెల్లించడమైంది." అన్నాడు ప్రొప్రయిటరు. నాకు సీను పైన చాలా కోపం వచ్చింది.

చరచరా బయటికి వచ్చి -"ఏం పని చేశావురా సీనూ! నేను భోంచెయ్యాలనుకున్నా నువ్వు బిల్లు చెల్లించడమూనా?" అంటూ కినుక ప్రదర్శించాను.

"అదేం మాట సుబ్బన్నా! చచ్చిపోయి సొర్గాన వుంది మీ అమ్మ. ఆ తల్లి పెట్టగా ఎన్ని పూటలు తిన్నానో! నువ్వేమైనా నేనిక్కడుండానని తెలిసి భోజనాని కొస్తివా? "నీకొక తమ్ముడున్నాడ్రా యిక్కడ" అని ఆ తల్లే నిన్నిక్కడికి తోసుకొచ్చి వుంటుంది" అన్నాడు సీను. వాడి కండ్లు కన్నీటి కుండలు కావడం చూచాను.

బస్సు మెయిన్‌రోడ్లన్నీ దాటుకుని నగరం శివార్లలో వస్తుండగా ఆనాటి మధ్యాహ్నం నేననుకున్నాను-"నువ్వొకడివి గనుక కనిపించకపోయి వుంటే నేనీ ఊరినుంచీ ఏడుస్తూ వెళ్ళి వుండేవాణ్ణిరా సీనూ! నువ్వు కనిపించావు గనుక నవ్వుతూ వెళ్తున్నాను. బెంగుళూరు మహానగరంలో నా వునికి కొక విలువను ఏర్పరిచిన వాడివి నువ్వు."

'ఆంధ్రప్రభ' వారపత్రిక-1991